ఆ తర్వాత అర్జునుడి చేతిలో హతమయ్యాడు. అలా గొప్పవాళ్ళ పురోభివృద్ధికి అల్పుడెవడైనా అడ్డుపడితే అతడ్ని సైంధవుడు అనడం ఆనవాయితీగా మారింది.”

విశ్వ మాత్రమే కాదు ఉపాధ్యాయ గారూ అవాక్కయిపోయారు కృషి చెప్పింది విని - పెరిగింది ఎక్కడైనా ఏ వాతావరణంలోనైనా గాని ఇక్కడి సంస్కృతి గురించి కృషి మరిచిపోకపోవడం ఒక్కటే కాదు - ఒక సాధనలా విషయాన్ని క్షుణ్ణంగా శోధించడాన్ని అలవాటుగా మార్చుకుంది ఇప్పటిక్కూడా-

మృదువుగా నవ్వారాయన “సో. . . సమస్యల సైంధవుల్ని నెగ్గుకురావాలీ అంటే క్రియేటివిటీ వుంటే చాలంటావు.”

“యస్ గ్రాండ్‌పా. . .” విశ్వనాథ్ వేపు చూసింది. ఇప్పుడు ఆమె టార్గెట్ విశ్వ మాత్రమే-

“క్రియేటివిటీ పట్టుదలకీ కారణమౌతుంది. ఆ పట్టుదల ఆలోచనా శక్తిని పెంచుతుంది - ఆ శక్తి పైకి దూసుకొచ్చే చీకటిని ఓడించే విద్యుచ్ఛక్తి ఉనికిని కనుక్కోటానికి, మనిషి పురోభివృద్ధికి, సైంధవులని కడతేర్చే మారణాస్త్రాలని తయారుచేయడానికి, మొత్తం చరిత్ర పరిణామానికి మూలమౌతుంది. దాన్నే కృషి అంటారు.”

చురుక్కుమందేమో వెంటనే జోక్యం చేసుకున్నాడు విశ్వ “కృషి ఒక్కటే చాలదు మిస్ కృషి. . .దీక్ష కావాలి. . . దీక్షంటే మొండితనం కాదు”

“దీక్ష కావాల్సింది తపోభంగం కాకూడదనుకునే ఋషులకి మిస్టర్ విశ్వా. . . భంగపడుతున్నా ముందుకెళ్ళే ప్రాక్టికాలిటీకి అవసరం మొండితనమే.”

“అది రిస్క్ తీసుకోవడం అవుతుంది” తన చర్యని సమర్థించుకోబోయాడు విశ్వ.

“ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడుపోతున్న పాప్‌కార్న్ కంపెనీ అధిపతి ఓర్‌వెల్లి రెడెన్ బీచర్ తన జీవితాన్ని ప్రారంభించింది ఓ మామూలు సేల్స్‌మెన్‌గా - ఆదిలో అంతా అతడ్ని అవమానించారు. పాప్‌కార్న్‌తో వ్యాపారం చూసి రిస్క్ తీసుకుంటున్నావని ఎగతాళి చేశారు. అయినా మొండితనంతో సాధించాడు. ఇప్పుడు రెడెన్ బేచర్ స్లోగన్ “ఒక్కటే నన్ను ప్రోత్సహించి పైకి తెచ్చింది. ఆనాడు నన్ను నిరుత్సాహపరిచిన వ్యక్తుల స్ఫూర్తి!” అలాగే కాలేజీ నుంచి సస్పెండ్ అయ్యాక టెక్సాస్ ఆయిల్ ఫీల్డులో అడుగుపెట్టి వ్యక్తిగతంగా ఆయిల్ ఎక్స్‌ప్లొరేషన్‌కి సిద్ధపడ్డ ‘డ్యూక్ రడ్‌మన్’ పదకొండు సంవత్సరాల సుదీర్ఘకాలం ఓడిపోయాక చివరికి నూనె నిక్షేపాన్ని సాధించాడు. మొండి పట్టుదలతో రెండు వందల ఇరవై మిలియన్ డాలర్ల ఆస్తికి అధిపతి అయ్యాడు. అతడి స్లోగన్ “నా గెలుపులో ఎక్కువ శాతం నన్ను ప్రోత్సహించింది నేను పొందిన వైఫల్యాలే ” అన్నది. “సో. . .” క్షణం ఆగి అంది. “అమెరికాకి చెందిన ఈ ఇద్దరు ప్రముఖులు ఎదిగింది సమస్యల నుంచి రిస్కుల నుంచి మొండితనం నుంచీ - ఇక్కడ మొండితనం అనే పదాన్ని నేను ఎందుకు వాడాల్సి వచ్చిందీ అంటే ఓటమి ఎదురైతే ప్రతిసారీ వాళ్ళు వెనుకడుగు వేయకుండా మొండితనంతోనే ముందుకు దూసుకుపోయారు కాబట్టి.”

"మీ ఆర్గ్యుమెంట్‌ని నేను అంగీకరించలేక పోతున్నాను మిస్ కృషి" ఆమె ఆలోచనా విధానం తప్పని నిరూపించడమే తన ధ్యేయం అన్నట్టుగా చెప్పాడు విశ్వ "మీరు చెప్పింది అన్ని రంగాలకీ వర్తించదు. పాట పాడలేని వాడు ఎంత మొండిగా కృషి చేసినా సంగీత విద్వాంసుడు కాలేడు."

"అసలు పాటే పాడలేనివాడు సంగీత విద్వాంసుడు కావాలనుకోడు మిస్టర్ విశ్వనాథ్. మరో వ్యాపకం అంటే, తన అభిరుచికి అనుకూలమైన మరో వ్యవహారం వేపు మొగ్గు చూపిస్తాడు. లేదూ మొండిగా సంగీత విద్వాంసుడ్ని మాత్రమే కావాలీ అనుకుంటే ప్రారంభం దగ్గరే అంతమైపోతాడు.

"అంటే మొండితనం ఒక్కటే ఏదన్నా సాధించడానికి సరిపోదనేగా" కంక్లూడ్ చేశాడు విశ్వ కృషిని ఖండిస్తున్నట్టుగా "యస్ మిస్ కృషి . . . మనిషి ఒక గమ్యాన్ని చేరాలీ అంటే కావాల్సింది ముందు సంకల్పం. తర్వాత దానికోసం ప్రణాళిక. ఆ తర్వాత సాధించింది నిలుపుకోటానికి నిర్విరామ పోరాటం. . . ఈ పోరాటం అన్నది ఓ స్థాయికి చేరిన సంగీత విద్వాంసుడు రోజూ చేయాల్సిన సాధనలాంటిది. IF YOU MISS ONE DAY PRACTICE YOU NOTICE THE DIFFERENCE. IF YOU MISS TWO DAYS OF PRACTICE, THE CRITICS NOTICE THE DIFERENCE, IF YOU MISS THREE DAYS OF PRACTICE THE AUDIENCE NOTICES THE DIFFERECE. ఇది కేవలం సంగీతానికే కాదు, మనిషి జీవితంలో ప్రతి ప్రక్రియకీ వర్తిస్తుంది."

తెలివిగల యిద్దరు వ్యక్తుల మధ్య సాగుతున్న ఆ చర్చ ఉత్సాహాన్ని కలిగించిందో లేక వారి చర్చల్లో జోక్యం చేసుకోకూడదనుకున్నారో ఉపాధ్యాయ నెమ్మదిగా లేచి వెళ్ళిపోయారు.... ఆ గదిలో తన ముందు అణుకువగా నిలబడటం మాత్రమే తెలిసిన విశ్వ యిప్పుడు క్రమంగా ఆ యింటిలోని ఓ వ్యక్తిలా కృషితో మాట్లాడం ఆయనకీ ఆనందంగా వుంది. . . విశ్వ ఉనికిని భరించలేనట్టుండే కృషి సైతం విశ్వని తనతో బాటు ఓ మేధావిగా అంగీకరించడం ఆయన కోరుకుంటున్నదే. ఇక్కడకూడా వ్యాపార బంధంలాగే ఆలోచించారు తప్ప అంతకుమించి స్నేహాన్ని ఆయన ఆశించలేదు... ఆశించరుకూడా. . . తన సామ్రాజ్య విస్తరణలో కొందరు విశ్వనాథ్‌లు తనకు అండగా వుండటాన్ని ఆయన కోరుకుంటున్నారు. అంతే. . .

ఉపాధ్యాయగారు వెళ్ళాక విశ్వ కూడా తన గదివేపు నడవబోతుంటే పిలిచింది కృషి "ఆగు"

నిశ్చలంగా చూశాడు విశ్వ "తెలివైనదానివి కృషి. . .మొత్తానికి మీ గ్రాండ్‌పాకి ఫోటోలు చూపించే అవసరాన్ని తప్పించావు"

కృషి పిడికిళ్ళు బిగుసుకున్నాయి "ఎలా తీశావీ ఫోటోలు"

"అది చెప్పాలీ అంటే కెమెరాలోని రకాలు వాటి ఉపయోగాల గురించి నీకు చిన్న సైజు లెక్చరివ్వాల్సి వుంటుంది."

"ఆ వివరాలు నాకు అవసరం లేదు మిస్టర్ విశ్వ . . . ఈ సాహసాన్ని ఎక్కడ ఎలా చేయగలిగావూ అని"

"నీ బెడ్‌రూంలోనే. . ." మృదువుగా నవ్వాడు విశ్వ.

"అవును కృషి. నీకు ప్రతి రాత్రీ నిద్రపోయేముందు కాంప్లాన్ తాగడం అలవాటుగా. అందులో కొన్ని ట్రాంక్విలైజర్సు కలిపాను. . . తర్వాత నువ్వు మత్తుగా నిద్రలోకి జారేక అర్ధరాత్రి నీ బెడ్‌రూంలోకి దూరి నిన్ను నా గుండెలపైకి లాక్కుని అప్పుడు. . ."

"స్టాపిట్" అరిచింది ఆవేశంగా.

"చెప్పనియ్ కృషీ. . . నిన్ను నా గుండెలపైకి లాక్కున్నాక నాలో కలిగిన రసాయనికమైన మార్పుల గురించి, ఆ తర్వాత నన్ను నేను అదుపు చేసుకోటానికి నేనుపడ్డ శ్రమ గురించి వివరంగా తెలియచేయనియ్.'

"అవసరం లేదు" అది అతడిపైన ద్వేషమో లేక తన ఇంటిలో తనపై చేసిన ప్రయోగానికి తన శరీరాన్ని తనే కోసుకోవాలన్నంత జుగుప్సాకరమైన భావమో కంపించిపోతూ అంది"అసలు ఇలా చేయడానికి నీకెన్ని గుండెలు. . ."

"ఒక లక్ష్యం సాధించడానికి రిస్క్ ఎంత అవసరమో బిజినెస్ టైకూన్స్ రెడన్ బేచర్ డ్యూక్ రడ్‌మన్‌ల కథల ద్వారా యిందాకే తెలియచెప్పావుగా కృషీ . . . అయినా నిన్ను నేనేం రేప్ చెయ్యలేదే. . . రెచ్చిపోయే నీలాంటి ఆడపిల్లని అదుపు చేయడానికి అవసరమని ఇలా ఫోటోలు తీశాను. . . అఫ్‌కోర్స్ కొన్ని పుట్టుమచ్చల్ని చూశాననుకో."

"వ్వాట్" రొప్పుతూ చూసింది కృషి " అంటే నువ్వు. . . "

మనసు విస్ఫోటనంతో మెదడు నిశ్శబ్దం చెదిరిన కృషి కలవరపాటుగా ఆగిపోయింది. అది కలవరం కూడా కాదు. ఏ విషాద నిశీధాల వెన్నెల మరకలో కలుషితమయినట్టు ఇంకా ఒలకని యవ్వన మధు పాత్రలోని అనుభూతుల మాధుర్యాన్నో అనుమతిలేకుండా మరెవరో తాకినట్టు కలత చెందింది. . . యింతకు తెగించిన ఈ మనిషి ఇంకా ఏం చేసి వుంటాడు.

"కేవలం చూశానే తప్ప ఏదో చేసినట్టు అంత కంగారు పడతావేం - కృషీ" ఆర్ధ్రతకి భావుకతని రంగరించి స్వప్నంలోలా అన్నాడు విశ్వ. "అప్పటిదాకా తెలీదు నాకు పగిలిపోతున్న క్షణాలలోని నిశ్శబ్దాల మధ్య అందం కూడ ఓ అస్థిత్వం కాగలదని - మనసు పడితే నేను తలదాచుకునే దివ్యరస సౌధానివి కాగలవని అప్పటిదాకా నాకు అర్థం కాలేదు. ఏకాంతపు పాలరాతి మందిరాన నీ సన్నిధిలో కూర్చుంటే నిన్నటి నా ఎడారి తీరాల్ని మరిచి విస్ఫారిన నేత్రాలలో నీ తనువంతా వెదకాలనిపించింది - అరమోడ్పులైన నేత్రాంచలాల్లో అనంతానంత లోకాల్ని చూస్తూ కదలని నీ పాద మంజీర ధ్వనుల్ని వింటూ ఏ సుదూర తీరాలకో

స్మృతుల జీవన భృతిలో రాలిపోతేనేం అనిపించింది. నీలోని ప్రభాత కోమలత్వాన్ని ఆస్వాదిస్తూ నిన్ను తాకే ప్రత్యూష పవనాన్నై యోగసిద్ధిని పొందాలనీ మనసు తొందరపడింది. నఖశిఖ పర్యంతం తక్షకుడిలా కాటు వేయడం నాకు కష్టం కాదు కృషీ. అప్పటి అవకాశం నాది - అయినా నిగ్రహించుకున్నాను ఎందుకో తెలుసా - నువ్వు తరుణీవీ వైతరణీవీ అన్న ఆలోచన నా మనసు మైదానంలో అలవోకగా మెదిలిన సజీవ స్వప్న లావణ్య శాఖవని.”

“స్టాపిట్” అరిచింది యిక వినలేనట్టుగా - అది మోదమో ఉన్మాదమో ఆమెకే తెలీదు కాని ఇప్పటి మానసిక స్థితిలో అతడి భావుకత భరింపశక్యం కానిదైంది. “ఐ హేట్యూ.”

“సహజమే. . .” విశ్నులో ఇందాకటి లాలిత్యం లేదు.

“ఉర్ధ్వోష్టమున పుట్టుమచ్చగల అమ్మాయి మంచి వంశంలో జనించి మంచి కీర్తి ప్రతిష్టలు పొందడమేగాక ఇలా స్వాతిశయాన్ని ప్రదర్శిస్తుంది. అయితే పెళ్ళి అయ్యాక ఇటువంటి మాటలకి అద్భుతంగా స్పందిస్తూ మృష్టాన్న భోజనాలతో భర్తకి ఆనందాన్ని పరుపుపై అమితమైన సుఖాన్నీ ఇస్తుందీ అని చెబుతుంది పుట్టుమచ్చల శాస్త్రం. . . ఇంతేకాక ఈ ఉర్ధ్వోష్టమున పుట్టు మచ్చగల అమ్మాయి- ”

ఆమె తనను తాను మరిచినట్టు అమాంతం విశ్ను షర్టు కాలరు పట్టుకుంది. అసలు కృషిలాంటి అమ్మాయి అలాంటి సాహసం చేయగలదని విశ్ను సైతం వూహించలేకపోయాడు.

“చెప్పు. . . ఉర్ధ్వోష్టము అంటే. . .” సీరియస్‌గా అడిగింది. “ఎక్కడ . . .ఏ ప్లేసది. . . ”

విశ్ను మొహంలోని చిలిపితనం ఆమెనెంత ఉద్రేకపరిచిందీ అంటే యించుమించు కుదిపేసింది “చెప్పమంటున్నది నిన్నే”

“ఇందాక సైంధవుడి గురించి వివరంగా చెప్పేసి నీకున్న పరిజ్ఞానాన్ని నీ తాత ముందు ఏకరుపెట్టావ్... ఆ పదానికి అర్థం తెలియక పోవడమేమిటి. . . అది నగ్నంగా వుండే ప్రాంతం..... వెళ్ళిచూసుకో. . .”

“య్యూ. .. ” ఉక్రోషంతో గోడకి నెట్టి విశ్ను చెంపలు పగలగొట్టేదే. అదిగో అప్పుడు చూసింది ద్వారం దాటి వస్తున్న నౌకరుని. అంతే విడిచిపెట్టింది.

ఆ తర్వాత ఆమె ఇంటిలో ఉండలేక పోయింది. అతడితో మాట్లాడుతుంటే చికాగ్గా వుందో అతడి ప్రవర్తన చికకు కలిగిస్తూందో స్పష్టంగా తోచడం లేదు. . . డాక్టర్ మహంతిని కలుసుకోవాలనుకుంది. అతడి గురించి అతని తండ్రి మరణం గురించి వివరంగా తెలుసుకోవటానికి ఆయన్ని మించి మరోదారి లేదు.

కారులో వెళుతూ సైతం అనుకుంది.

ఉర్ధ్వోష్టమూ అంటే ఏమిటి. . .పైగా ఆ భాగమంతా నగ్నంగా వుంటుందంటా డేమిటి. . .

0 0 0

“ఆశ్చర్యంగా వుంది కృషి- విశ్ను మోహన్‌గాంధీ కొడుకంటే నమ్మలేక పోతున్నాను” [illegible] అన్నాడు డాక్టర్ మహంతి.

"నాక్కూడా తెలిసింది ఈ రోజు ఆశ్రమానికి వెళ్ళాకనే అంకుల్ చైతన్యానందగారు విశ్వ కుటుంబం గురించి చెప్పింది విన్నాక నా అనుమానం నిజమనిపించింది" క్షణం ఆగి అంది కృషి "చెప్పండి అంకుల్. మోహన్‌గాంధీ ఎలా చనిపోయాడు"

చాలా సేపటిదాకా నిశ్శబ్దంగా వుండిపోయాడు డాక్టర్ మహంతి. . . ఉపాధ్యాయ కుటుంబానికి ఆత్మీయుడైన మహంతి కళ్ళలో చెప్పాలా వద్దా అన్న సందిగ్ధత. . .

"ప్రత్యేకించి మిమ్మల్ని అడగడంలో నా ఉద్దేశ్యం నిజం మీకు మాత్రమే తెలిసి వుంటుందన్న నమ్మకం అంకుల్ . . . కేవలం మీ వెర్షన్ ఆధారంగా మోహన్ గాంధీ హత్యలో గ్రాండ్‌పా ప్రమేయం ఎంతవరకున్నదీ తెలుసుకోవాలనుకుంటున్నాను"

విభ్రమంగా చూశాడు డాక్టర్ మహంతి "హత్య జరిగిన మాట నిజం కృషి. కాని దానికి మీతాతయ్య బాధ్యుడు కాదు. ఎందుకంటే తన సామ్రాజ్య విస్తరణకి మీ తాతయ్య తన వాళ్ళని వదులుకోగలడేమో కాని హత్యలు చేయించి అడ్డుతొలగించుకునేటంత రాక్షసుడు కాడు."

నిర్వేదంగా నవ్వింది కృషి "హత్యలు చేయించడం అంటే ఆయుధాల్ని ఉపయోగించి చంపమనడమొక్కటే కాదంకుల్. చావటానికి అనుకూలమయిన పరిస్థితుల్ని సృష్టించడమూ హత్య చేయడమే అవుతుంది."

"కౌశిక్‌ని దృష్టిలో పెట్టుకుని నువ్విలా మాట్లాడుతున్నావనుకుంటాను."

"యస్" కృషి కళ్ళలో జివ్వున నీళ్ళు తిరిగాయి. "నేను కోరుకున్న కౌశిక్ చావుకి కారణమైన ప్రమాదం గ్రాండ్‌పా సృషించింది కాదు. కాని గ్రాండ్‌పా ఇచ్చిన షాక్ కౌశిక్‌ని జీవచ్ఛవంగా మార్చేసింది. చావులాంటి బ్రతుకునుంచి చావడం దాకా తరిమింది. డబ్బు, ప్రతిష్ట, అంతస్తులు యివేగా గ్రాండ్‌పా ఆరాధించేది. ఎప్పుడో రెండున్నర దశాబ్దాల క్రితం తన చెల్లెలు ఓ సామాన్యుడ్ని ప్రేమించినందుకు యింటినుంచి బయటకి సాగనంపటానికి గాని ఆ తర్వాత ఆమె కేన్సరుతో ప్రాణాలు కోల్పోయే స్థితిలో ఉందని తెలిసీ సహాయం చేయటానికి తిరస్కరించి ఆమె చావుకి కారణం కావటానికి కారణం ఈ అంతస్తుల వ్యామోహమేగా. . . అంతే అంకుల్. ఈ రోజు మోహన్‌గాంధీ చావుకీ యించుమించు అలాంటి కారణం ఒకటి వుండి వుండాలి. లేకపోతే మా కుటుంబాన్ని నాశనం చేయడానికి విశ్వ అనే ఓ వ్యక్తి యింటిలో అడుగుపెట్టేవాడు కాదు. . ."